

30 వరకు వ్యవసాయ డిప్లమో కోర్సులకు గడువు పెంపు

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ద్వారా నిర్వహించే వ్యవసాయ డిప్లమో కోర్సులకుగాను ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొనుటకు గడువును ఈనెల 30వ తేదీ వరకూ పొడిగించినట్లుగా మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఎడిఆర్ డాక్టర్ టి.శ్రీనివాస్ ఇక్కడ తెలిపారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం వారు ఈనెల 16వ తేదీన ముగియాల్సిన ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఈనెల 30వ తేదీ వరకూ పొడిగించినట్లుగా తెలిపారు. ఏ కారణం చేతనైనా ఇప్పటి వరకూ రిజిస్ట్రేషన్ చేసుకోనివారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ %www.angrau.ac.in% ను వీక్షించ వలసిందిగా కోరారు. స్థానికులు ఏవైనా సందేహాలుంటే ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం మార్టేరు లేదా వ్యవసాయ పాలిటెక్నిక్, మార్టేరు కార్యాలయ పనివేళల్లో వచ్చి సంప్రదించవచ్చని ఆయన పేర్కొన్నారు.


చినుకు రాలదు.. సాగు సాగదు..!

వర్షాభావంతో మందకొడిగా సార్వా పనులు

జులై నెలాఖరు వరకూ నాట్లు సాగే అవకాశం

ప్రజాశక్తి - కాళ్ల

సార్వా సీజన్ ప్రారంభంలోనే రైతులను వర్షాభావ పరిస్థితులు వెంటాడుతున్నాయి. రుతుపవనాలు ముందుగా వచ్చినా వర్షాలు సరిగా కురవకపోవడంతో సార్వా సాగు పనులు మందకొడిగా సాగుతున్నాయి. జూన్ ఒకటో తేదీన కాల్వలకు నీరు వదిలారు. సాధారణంగా జూన్ నెలాఖరు నాటికే నారుమళ్ల ప్రక్రియ పూర్తి కావాల్సి ఉంది. అయితే వర్షాలు కురవకపోవడం, కాల్వలకు నీరు వదిలినా మరమ్మతులు, ఇతర పేర్లతో పూర్తిస్థాయిలో నీరు దిగువకు విడుదల చేయకపోవడంతో దుక్కులు సైతం చేయలేని పరిస్థితి ఏర్పడింది.



నారుమడి వేసేందుకు కారెం సాయంతో నీటిని తోడుతున్న రైతు

జిల్లాలో రైతులు జులై మూడో వారంలోగా వరి నాట్లు పూర్తి చేయాలని వ్యవసాయాధికారులు రైతులకు సూచిస్తున్నారు. జూన్ చివరి నాటికి నారుమళ్ల ప్రక్రియ పూర్తి చేసి, జులై మూడో వారం నాటికి నాట్లు పూర్తి చేస్తే ఎటువంటి ఇబ్బందీ ఉండదని చెబుతున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో రెండు లక్షల ఎకరాల్లో, ఏలూరు జిల్లాలో లక్షా 50 వేల ఎకరాల్లో వరిసాగు చేయనున్నారు. ఈ మేరకు పశ్చిమలో 37,500 ఎకరాల్లో నారుమడులు వేయాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు కేవలం 1500 ఎకరాల్లోనే నారుమడుల ప్రక్రియ పూర్తయినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి.



నారుమడి కోసం దమ్ము చేస్తున్న ట్రాక్టర్

సాగులో సన్న రకాలను ప్రోత్సహించేందుకు ఎంటియు 1262 రకం విత్తనాలను అన్ని మండలాల్లో దాదాపు 125 ఎకరాల్లో విత్తన పంటగా వేయడానికి అధికారులు కృషి చేస్తున్నారు. 50 శాతం సబ్సిడీపై ఈ విత్తనాలు అందిస్తున్నారు.

వరిసాగులో నానో యూరియా వాడకాన్ని ప్రోత్సహించడానికి జిల్లావ్యాప్తంగా మూడు లక్షల ఎకరాలకు అవసరమైన నానో యూరియా, డిఎపి ప్రయివేటు మార్కెట్లో అందుబాటులో ఉంచారు.

భూసారాన్ని బట్టి ఎరువులను వాడాలి

అధికంగా ఎరువుల వాడకాన్ని తగ్గించడానికి రైతులకు భూసార పరీక్షల కార్డులు అందిస్తున్నారు. ఫలితాల ఆధారంగా ఎరువులు వినియోగించడం ద్వారా అధిక దిగుబడులకు అవకాశం ఉంటుంది. దీనిలో భాగంగా గతేడాది 16,205 మట్టి నమూనాలు సేకరించారు. ఈ ఏడాది 22,500 మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షలకు తాడేపల్లిగూడెం ల్యాబ్‌కు పంపించారు. వ్యవ సాయ భూముల్లో నత్రజని, కార్బన్, జింకు తక్కువగా ఉన్నాయని గుర్తించారు. ఈ మేరకు రైతులకు భూసార పరీక్షలు కార్డులు అందించి వాటి ఆధారంగా ఎరువులు వాడకంపై అవగాహన కల్పిస్తున్నారు.

ముందస్తు నాట్లు మేలు

జడ్.వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయాధికారి, భీమవరం



సార్వా సాగులో వీలైనంత త్వరగా ముందస్తు నాట్లు వేయడం వల్ల మంచి దిగుబడులు సాధించొచ్చు. ఇప్పటికే పంట కాల్వల్లో సమృద్ధిగా నీరు ఉంది. రైతుల త్వరిత గతిన నారుమడులు వేయాలి. ఇప్పటి వరకు 1500 ఎకరాల్లోనే నారుమడులు పూర్తయ్యాయి. విత్తనాలు, అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయి. జులై మూడో వారం నాటికి నాట్లు ప్రక్రియ పూర్తి చేస్తే నవంబర్, డిసెంబర్‌లలో సంభవించే తుఫాన్ల వల్ల ఎటువంటి ఇబ్బందీ ఉండదు.

8 లక్షల మందితో 4,835 ప్రదేశాల్లో యోగా

జిల్లాలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

కలెక్టర్ చదలవాడ నాగరాణి



భీమవరంలో యోగా చేస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

అంతర్జాతీయ యోగా దినోత్సవం జిల్లాలో ఘనంగా నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శనివారం స్థానిక కలెక్టరేట్ పెరేడ్ గ్రౌండ్‌లో యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నెల రోజులుగా జిల్లావ్యాప్తంగా యోగాభ్యసన కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించామన్నారు. 8 లక్షల మందితో పెద్దఎత్తున యోగా దినోత్సవం నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ప్రతిరోజూ యోగాభ్యాసం చేసి సంపూర్ణ ఆరోగ్యం పొందాలన్నారు. యోగాంధ్ర కార్యక్రమాలను విజయవంతం చేసినందుకు జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డిని ఆమె అభినందించారు. జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేశారని కితాబిచ్చారు. జిల్లావ్యాప్తంగా 4,835 ప్రాంతాల్లో సుమారు 8 లక్షల మందితో విజయవంతంగా యోగా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. రాజ్యసభ సభ్యులు పాకా సత్యనారాయణ మాట్లాడుతూ నెల రోజులుగా యోగాభ్యసన కార్యక్రమాలు నిర్వహించిన జిల్లా అధికార యంత్రాంగాన్ని అభినందించారు. అనంతరం గ్రామ, మండల, జిల్లాస్థాయిలో నిర్వహించిన యోగా పోటీల్లో, జిల్లాస్థాయిలో వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, డిఆర్‌ఒ మొగిలి వెంకటేశ్వర్లు, కెఆర్‌ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణరెడ్డి, ఆర్‌డిఒ కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, డ్వామా పీడీ డాక్టర్ కెసిహెచ్.అప్పారావు, జిల్లా టూరిజం అధికారి ఎవి.అప్పారావు, డిఇఒ ఇ.నారాయణ, వివిధ శాఖల జిల్లా అధికారులు, విద్యాసంస్థల విద్యార్థులు, పట్టణ ప్రముఖులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, ప్రజలు పాల్గొన్నారు.

9న జాతీయ సమ్మె డోర్ స్టిక్కర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - తణుకు



సిఐటియు ఆధ్వర్యంలో సమ్మె డోర్ స్టిక్కర్లను ఆవిష్కరిస్తున్న నేతలు


జులై 9న జరిగే జాతీయ సమ్మెలో కార్మికులు, ఉద్యోగులు, పెద్దఎత్తున పాల్గొనాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక నరేంద్ర సెంటర్‌లో సిఐటియు ఆధ్వర్యంలో సమ్మె డోర్ స్టిక్కర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్స్ ఉద్యోగ, కార్మికులకు చాలా నష్టం చేస్తాయన్నారు. లేబర్ కోడ్స్ అమలుతో కార్మికులు ఇప్పటి వరకు సాధించుకున్న హక్కులన్నీ కోల్పోతారని హెచ్చరించారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం మోడీ బాటలో నడుస్తూ పని గంటల పెంపు, మహిళలకు అర్ధరాత్రి డ్యూటీల అమలు కోసం ఆదేశాలిచ్చారని తెలిపారు. జులై 9న సమ్మెలో రాజకీయాలకు అతీతంగా కార్మికులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు అజయకుమార్, గార రంగారావు, వెంకటేశ్వరరావు, హర్షవర్ధన్, గోవిందరాజు, కనకరత్నం, సత్య, మధుకేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి శ్రామికులకు బకాయి వేతనాలు ఇవ్వాలి



ఉండి మండలంలో...

సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్



పెంటపాడు మండలంలో..

ప్రజాశక్తి - ఉండి

ఉపాధి హామీ శ్రామికులకు పెండింగ్‌లో ఉన్న వేతన బకాయిలను వెంటనే విడుదల చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని చెరుకువాడ గ్రామంలో ఉపాధి హామీ శ్రామికుల సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ ఉపాధి హామీ శ్రామికులకు సంవత్సరానికి 200 రోజులు పని చూపాలని ప్రభుత్వం కేవలం 20 నుంచి 30 రోజులు మాత్రమే కల్పిస్తుందన్నారు. దీనివల్ల శ్రామికులు పనులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొంతకాలంగా చేసిన పనులకు వేతనాలు చెల్లించకపోవడం దారుణమని, తక్షణం వేతన బకాయిలు చెల్లించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో ఉపాధి హామీ పనులకు నిధుల కేటాయింపు పెంచాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు ధనికొండ శ్రీనివాస్, నాయకులు బీధ శేషు, రామకూరి వెంకటరత్నం, కింతాడ రమేష్, చిట్టి అన్నవరం, రామకూరి సన్నీ, రూజ్‌వెల్ట్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెంటపాడు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ప్రకారం శ్రామికులకు సంవత్సరానికి రెండొందల రోజులు పనులు చూపాలని సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పెంటపాడు మండలం యానాలపల్లిలో గ్రామీణ శ్రామికుల సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టంలో ఉన్న ప్రకారం కనీస వేతనం రూ.600 ఇవ్వాలన్నారు. శ్రామికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోవడానికి కార్మికులంతా ముందుకు రావాలని నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు జవ్వాది శ్రీను, కొరిడ్ల రామకృష్ణ, శిద్దిరెడ్డి శేషుబాబు, పోతు శ్రీను, తంగేటి శ్రీను, కర్రి సాయిశ్రీనివాస్‌రెడ్డి, కన్నంరెడ్డి శివాజీ, నాగిరెడ్డి సాయి, వడిసెల శ్రీను, పతివాడ నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

పోడూరు: ఉపాధి కూలీల వేతన బకాయిలు ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని సిఐటియు నేత పిల్లి ప్రసాద్ డిమాండ్ చేశారు. పోడూరు మండలం తూర్పుపాలెం ఆనందరావుపేటలో శనివారం ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఉపాధి వేతన బకాయిలు వెంటనే వారి కూలీల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలన్నారు. కనీసం 200 రోజులు పని చూపాలన్నారు. అనంతరం కర్రి రవి, భాగ్యలక్ష్మి దంపతులు ఉపాధి కూలీలకు పని ప్రదేశంలో శీతల పానీయాలు అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ కాకర వెంకటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఎం.మోజేష్, మేట్ అరిగెల కిషోర్, కర్ని చిన్నారి, నేలపాటి శైలజ, కారెం సక్కుబాబు, పొలమూరి లలిత, బందిల సతీష్, బుడితి గోపి, కుసుమే లావణ్య, రాజు, పి.స్వర్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

దళితపేటలో స్కూల్ విద్యార్థుల తరలింపు తగదు

కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు బత్తుల విజయకుమార్

ప్రజాశక్తి - పెనుమంట్ర

దళితపేటలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను మెర్జ్ పేరుతో దూరంగా పంపిస్తే ఊరుకునేది లేదని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు బత్తుల విజయకుమార్ శనివారం ఒక ప్రకటనలో అన్నారు. మండల కేంద్రం పెనుమంట్ర గ్రామంలోని చర్చి వీధిలో ఉన్న ఎలిజ పాఠశాల విద్యార్థులు, పేరెంట్స్ గత నాలుగు రోజులుగా ఆందోళన చేస్తున్న సంగతి విధితమే. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు బత్తుల విజయకుమార్ మాట్లాడుతూ పెనుమంట్ర గ్రామం ఎస్‌సి పేటలో సుమారు 60 సంవత్సరముల క్రితం నుంచి ప్రభుత్వ పాఠశాల ఎలిజ ప్రాథమిక పాఠశాలగా నడపబడుతుందని అన్నారు. స్కూల్‌లో ప్రతి సంవత్సరం సుమారు 50, 60 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారని తెలిపారు. ఇప్పుడు ఆ స్కూల్‌లో దాదాపు 40 మంది విద్యార్థులు చదువుతుండగా ఈ సంవత్సరం టీచర్లు లేరు, పిల్లలు లేరు అన్న వంకతో అర కిలోమీటర్ మించిన దూరంలో కనకదుర్గమ్మ ఆలయ సమీపంలో ఉన్న ఎంపియుపి స్కూలుకు దాదాపు 27 మంది పిల్లలను అధికారులు కలిపేయడం దారుణమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఐందుమంది ఆ ఏరియాలో 200 నుంచి 250 కుటుంబాలు నివసిస్తున్నాయని, ఆ కుటుంబాలకు ఆ స్కూలు ఆధారంగా ఉందని అన్నారు. రాజీవ్ కాలనీ నుంచి పిల్లలు విద్యాభ్యాసం చేయడం కోసం అర కిలోమీటర్ దూరంలో ఉన్న ఆ స్కూలకి వెళ్లారని, ఇప్పుడు అది కిలోమీటర్ దాటిందని, పిల్లలు మేము స్కూలుకి వెళ్లం అంటున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారని అన్నారు. ఆ స్కూల్ అన్ని వసతులు ఉన్నాయని అన్నారు. వెంటనే సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకుని యధావిధిగా ఒకటవ తరగతి నుంచి 5వ తరగతి వరకు ఆ స్కూలు నడిపించాలని కోరారు. లేదంటే రానున్న రోజుల్లో గ్రామస్తులతో కలిసి ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

రూ.8.88 కోట్లతో ఎర్రకాలువ వంతెన పనులకు శ్రీకారం

ఐదేళ్లలో వైసిపి చేయని పనులను కూటమి ఏడాదిలో చేసింది

రాష్ట్ర విప్, ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఐదేళ్లలో వైసిపి చేయని పనులను కూటమి ప్రభుత్వం ఏడాదిలో చేసి చూపించిందని రాష్ట్ర విప్, ఎంఎల్ఎ పోలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని వీరంపాలెం గ్రామంలో రూ.8 కోట్ల 88 లక్షల పిఎంజిఎస్ నిధులతో వీరంపాలెం, త్యాజంపూడి గ్రామాల మధ్య ఎర్ర కాలువపై వంతెనకు ఎంఎల్ఎ శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతి కేసులు, ఇసుక దోపిడీ, ఖనిజాలు అమ్మకం, దేశద్రోహం కేసులలో తలమునకలైన వైసిపి ప్రభుత్వ పాలనకు ప్రజలు స్వస్తి చెప్పి సంవత్సరకాలం అయిందని, అటువంటివారు కూటమి ప్రభుత్వంపై చేస్తున్న ఆరోపణలు రోడ్డుపై వెళుతుంటే శునకాలు మొరిగిన చందంగా ఉందని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. త్యాజంపూడి గ్రామాల మధ్య ఎర్రకాలువపై వంతెన నిర్మాణ పనులకు ఆయన, బిజెపి కన్వీనర్ ఈతకోట తాతాజీ శనివారం భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎర్రకాలువ వంతెన కూలిపోయి దాదాపు 15 సంవత్సరాలు కావస్తున్నా ఏ ఒక్క ప్రజాప్రతినిధి పట్టించుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎర్రకాలువపై దృష్టి సారించామన్నారు.



భూమి పూజ చేస్తున్న ఎంఎల్ఎ బొలిశెట్టి

నష్టాలుపాలు చేసిన రాష్ట్రాన్ని కేంద్రం నుంచి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సహాయ సహకారాలను చంద్రబాబు నాయుడు పవన్ కళ్యాణ్ సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ప్రజలు రాజకీయ నాయకులకు కులం చూసి, మతం చూసి ఓట్లు వేయరని, అభివృద్ధి చూసి గెలిపిస్తారని ఆయన అన్నారు. గత ప్రభుత్వ పాలనలో కాంట్రాక్టర్లు పనిచేసేందుకు భయపడే పరిస్థితి ఉండేదన్నారు. కేంద్రం అందిస్తున్న నిధులతో టెండర్లు పిలిచి కాంట్రాక్టర్ల ద్వారా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎంఎల్ఎ తెలిపారు. రప రపలాడిస్తామంటున్న జగన్‌కు మేము రప రపలాడించాలంటే 24 గంటలు సరిపోతుందని, ఇకనైనా జగన్ రౌడీజం మాటలు మానుకోవాలని హెచ్చరించారు. నియోజకవర్గ అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామని, ప్రజలు తమపై నమ్మకంతో ఓటు వేసి గెలిపించారని, వారి నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా పరిపాలన కొనసాగిస్తామని ఎంఎల్ఎ తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పరిమి రవికుమార్, జనసేన మండల అధ్యక్షులు అడపా ప్రసాద్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సెయింట్ ఆన్స్ విద్యాసంస్థలలో పుస్తకాల అమ్మకం ఆపాలి

స్కూల్ వద్ద ఎస్ఎఫ్ఐ నేతల ధర్నా

భీమవరం : సెయింట్ ఆన్స్ విద్యాసంస్థల్లో జరుగుతున్న పుస్తకాల అమ్మకం వ్యాపారాన్ని ఆపాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. విద్యాహక్కు చట్టాన్ని తుంగలో తొక్కేలా భీమవరం పట్టణంలో పలు కార్పొరేట్, ప్రయివేట్ స్కూల్స్ నిలుస్తున్నాయని విమర్శించింది. సెయింట్ ఆన్స్ స్కూల్లో యాజమాన్యం పుస్తకాల విక్రయాలను శనివారం ఎస్ఎఫ్ఐ నాయకులు అడ్డుకున్నారు. విద్యాశాఖ అధికారులకు సమాచారం అందించినప్పటికీ స్పందించకపోవడంతో పాఠశాల వద్ద బైఠాయించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బి.గణేష్ మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభంలో కార్పొరేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు విద్యారంగాన్ని వ్యాపారంగంగా మలుచుకోవడం దుర్మార్గమని మండిపడ్డారు. నాణ్యమైన విద్య పేరుతో యాజమాన్యులు వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తున్నారని, తల్లిదండ్రుల రక్తాన్ని పట్టిపీడిస్తున్నారని ఆరోపించారు. విద్యార్థులకు సెలవులు ఇవ్వకుండా తరగతి గదులు నిర్వహించడం దారుణమన్నారు. యాజమాన్యం పుస్తకాలు, యూనిఫారం పేరుతో రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు అదనంగా వసూలు చేస్తున్నారని తెలిపారు. వీటిపై స్పందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాలతో మండల విద్యాశాఖ అధికారి ఎంఇఒ-1 ఎన్.శ్రీనివాసరావు స్కూలు సందర్శించారన్నారు. ఆయన కళ్లముందే విద్యా వ్యాపారం జరుగుతున్న ఆ విద్యాసంస్థల పుస్తకాల అమ్మకం చేస్తున్న సరే అడ్డుకోకుండా నా పై అధికారులకు చెప్తాను, తర్వాత మాట్లాడదాం, ఇది నా పరిధిలో లేదంటూ సాకులు చెబుతూ అక్కడ 30 నిమిషాలు ఉండి తప్పించుకున్నారని ఆరోపించారు. అధికారులకు సమాచారం తెలిపినప్పటికీ పట్టించకపోవడం అన్యాయమని విమర్శించారు. గతంలో పలు విద్యాసంస్థల్లో పాఠ్యపుస్తకాల విక్రయాలు చేపడుతున్నాయని సమాచారం తెలిపినా ఎటువంటి స్పందన లేదని, సెయింట్ ఆన్స్‌పై అదే తీరు విద్యాశాఖ అధికారులు అవలంబిస్తున్నారని ఇది ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసే కుట్రలో భాగమేనని ఆరోపించారు. కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దందా వెనుక జిల్లా విద్యాశాఖ అధికారుల ప్రమేయం ఉన్నట్టు స్పష్టంగా అర్థమవుతుందని, వెంటనే జిల్లా కలెక్టర్ స్పందించి వీరిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే విద్యాహక్కు చట్టానికి వ్యతిరేకంగా పుస్తకాలు, యూనిఫార్మ్ అమ్మకాలు చేపడుతున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ కమిటీ అధ్యక్షులు ఎస్.లక్ష్మణ్, నాయకులు కె.గోవింద్, కె.రోహిత్, పి.సతీష్, నవీన్ పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ అఖిలభారత మహాసభను జయప్రదం చేయండి

ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి కె.గోవింద్

ఉండి : కేరళ రాష్ట్రంలోని కోజికోడ్ జిల్లాలో 27 నుంచి 30 తేదీ వరకూ జరిగే ఎస్ఎఫ్ఐ 18వ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి కె.గోవింద్ అన్నారు. శనివారం ఉండి మండల కమిటీ ఆధ్వర్యంలో ఇండియన్ డిజిటల్ స్కూల్, ప్రభుత్వ జూనియర్ కాలేజ్ వద్ద ఎస్ఎఫ్ఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సంఘం పతకంను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి కె.గోవింద్ మాట్లాడుతూ భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) 1970 డిసెంబర్ 30న స్వాతంత్రం, ప్రజాస్వామ్యం, సోషలిజం లక్ష్యాలుగా.. అధ్యయనం, పోరాటం నినాదంతో ఏర్పాటై 55 సంవత్సరాలు పూర్తి చేసుకుందన్నారు. ప్రభుత్వ విద్యా పరిరక్షణ కోసం 55 సంవత్సరాలుగా అలుపెరుగని పోరాటం నిర్వహిస్తూ ఎస్ఎఫ్ఐ ముందుకు పోతుందన్నారు. ఎక్కడైతే విద్యార్థుల సమస్యలు ఎదుర్కొంటున్నారో ఆ సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు నిర్వహించి విద్యార్థుల గుండెల్లో స్థానాన్ని సంపాదించుకున్న సంఘం ఎస్ఎఫ్ఐ అని వారు అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ, విద్యార్థులను పోరాటాలకు సిద్ధం చేస్తూ అనేక విజయాలను సొంతం చేసుకుందన్నారు. పేద విద్యార్థికి విద్య అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని గుర్తు చేస్తూ పోరాటాలు నిర్వహిస్తుందని వారు తెలిపారు. విద్యా పేద విద్యార్థులకు అందని ద్రాక్షలా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా రంగ సమస్యల పరిస్కారం కోసం ఎన్నో నిర్బంధాలని, అక్రమ కేసులను సైతం ఎదుర్కొంటూ పోరాటాన్ని ముందుకు కొనసాగిస్తుందని వారు అన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పోరాటాలకు విద్యార్థులు సిద్ధం అయ్యేందుకు అందరూ మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ మండల కమిటీ సభ్యులు సాయి, పి.సాయి, సతీష్ పాల్గొన్నారు.

విన్యాసాలు.. సమస్యలు..!

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని యోగాంధ్ర పేరుతో పాలకులు, అధికారులు సాగించిన విన్యాసాలు ప్రజలకు ఎంతమేర ఆరోగ్యాన్ని చేకూర్చాయోగాని సమస్యలు మాత్రం పట్టిపీడిస్తున్నాయి. ఎందుకంటే యోగా దినోత్సవం రోజున ప్రధాని మోడీ విశాఖ పర్యటన ఖరారైనప్పటి నుంచి యోగాంధ్ర పేరిట ప్రతిచోటా యోగా విన్యాసాలు అధికారికంగానే నిర్వహించడం ప్రారంభించారు. గత రెండు వారాలుగా అయితే రెండు జిల్లాల్లో అధికార యంత్రాంగం మొత్తం పనులన్నీ పక్కనబెట్టి యోగాంధ్ర నిర్వహణపైనే దృష్టి పెట్టాయి. రెండు జిల్లాల్లో ప్రతిసోమవారం నిర్వహించే పిజిఆర్‌ఎస్‌ను ఒక వారం పూర్తిగా రద్దు చేశారంటే జిల్లా అధికారులు యోగాంధ్రపై ఏస్థాయిలో కేంద్రీకరించారో అర్థం చేసుకోవచ్చు. యోగా విన్యాసాలపై కేంద్రీకరించిన జిల్లా అధికారులు సైతం ప్రజా సమస్యలను గాలికొదిలేయడం సర్వత్రా చర్చనీయాంశమైంది.

ప్రధానంగా విద్యాసంస్థలు ప్రారంభమయ్యాయి. ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల బాదుడు, విద్యా సామగ్రి అమ్మకాలు తదితర అంశాలపై ఇటు విద్యార్థుల తల్లిదండ్రులు, అటు విద్యార్థి సంఘాలు ఆందోళన చేస్తున్నా ఇటు విద్యాశాఖగాని, అటు జిల్లా ఉన్నతాధికారులుగాని పట్టించుకున్న దాఖలాల్లేవు. పశ్చిమగోదావరిలో ఆ జిల్లా కలెక్టర్ ప్రయివేటు విద్యాసంస్థల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించి నిబంధనల ఉల్లంఘనపై హెచ్చరికలు చేశారు. ఏలూరు జిల్లాలో కనీసం ఆ పరిస్థితీ లేకపోవడం గమనార్హం. దీంతో ప్రయివేటు విద్యాసంస్థలు ఇష్టానుసారంగా నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు, యూనిఫారం, బెల్టు, ఐడికార్డు, ఇతరాలు అంటూ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి భారీగానే వసూళ్లు చేశాయి. విద్యార్థి సంఘాల నేతలు ఆయా స్కూళ్లకు వెళ్లి పరిస్థితిని గమనించి విద్యాశాఖాధికారులకు సమాచారం ఇచ్చినా రాతపూర్వకంగా ఇస్తే చర్యలు తీసుకుంటామని చెప్పడం విద్యాశాఖలో నెలకొన్న అవినీతికి నిదర్శనమనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఇక రేషన్‌లైజేషన్ పేరిట యుపి స్కూళ్లను ప్రాథమిక పాఠశాలలుగా మార్చడం తదితర సమస్యలు విద్యార్థులను, వారి తల్లిదండ్రులను వేధిస్తున్నాయి. మండల కేంద్రమైన పెనుమంట్రలో



ఎలిజ స్కూల్ నుంచి సమీపంలోని మెయిన్ స్కూల్‌కు 3, 4, 5 తరగతులను తరలించడంతో 24 మంది విద్యార్థుల భవిష్యత్తు అయోమయంలో పడింది. ఎందుకంటే అరకిలోమీటరు దూరంలోనే ఆ స్కూల్ ఉన్నా చిన్నారులు తాడేపల్లిగూడెం-మార్టేరు రాష్ట్రీయ రహదారి గుండా వెళ్లాల్సి రావడం ఇబ్బందికరంగా మారింది. ఇదే పరిస్థితి ముదినేపల్లి మండలం కోడూరులో నెలకొంది. అక్కడ యుపి స్కూల్‌ను ప్రైమరీ స్కూల్‌గా మార్చడంతో సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న హైస్కూల్‌కు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ఈ సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాల్సిన అధికారులు మాత్రం యోగాసనాల్లో మునిగి తేలుతుండటం గమనార్హం.

ఇక తల్లికి వందనం సొమ్ము రాక తల్లులు విద్యుత్ శాఖ కార్యాలయాలు, సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు. సంబంధం లేని కారణాలతో తల్లికి వందనం సొమ్ము జమ చేయకపోవడంతో ఏం చేయాలో పాలుపోక తలలు పట్టుకుంటున్నారు. ఇక అంగన్వాడీలు, మున్సిపల్ కార్మికులు తమకు ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని కోరుతూ ఆందోళనలు చేపట్టారు. అంటే ప్రభుత్వ పథకాలు చిరుద్యోగులకు సైతం కట్ చేశారని స్పష్టమవుతోంది. దీనిపై చెప్పుకోవడానికి అధికారులు అందుబాటులో లేకపోవడంతో చిరుద్యోగులు ఆయా కార్యాలయాల్లో సిబ్బందికి వినతిపత్రాలిచ్చి వెనుదిరగాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

కొల్లేరు విషయంలో సానుకూలత

కొల్లేరులో పరిస్థితుల అధ్యయనానికి విచ్చేసిన కేంద్ర సాధికార కమిటీ పర్యటన విషయంలో జిల్లా కలెక్టర్, అధికారులు మంచి కృషి చేశారనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. ప్రజలు, ప్రజాసంఘాల నేతలు స్వేచ్ఛగా కమిటీకి వినతులిచ్చే అవకాశం కల్పించడంలో జిల్లా అధికారుల కృషి అభినందనీయం. తొలిరోజు క్షేత్రస్థాయిలో పర్యటించిన కమిటీ రెండో రోజు ఏలూరులోనే వినతుల స్వీకరణతోపాటు అధికారుల నుంచి సమగ్ర నివేదికలు కోరడం, ప్రజల ఆవేదనను సావధానంగా వినడం సానుకూలాంశాలుగా ఉన్నాయి. అందరి డిమాండ్ ఒకటే. కొల్లేరును మూడో కాంటూరుకు కుదించి జిరాయతీ, ప్రభుత్వ భూములను పేదలకు ఇవ్వాలనేది. గతంలో ప్రధాని మోడీ ఇచ్చిన హామీ అమలు చేసేలా చర్యలు చేపడితే చాలావరకూ సమస్య పరిష్కారమవుతోంది. ఆ దిశగా కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం చర్యలు చేపట్టేలా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కూడా ఒత్తిడి పెంచాల్సిన అవసరం ఉంది. మరి కొల్లేరు ప్రజల ఆశలు నెరవేరుతాయా, లేక అడియాశలుగా మిగిలిపోతాయా అనేది మరికొంత కాలం వేచిచూడక తప్పదు. ఏదేమైనా కొల్లేరు కమిటీ పర్యటన మినహా పాలనను, ప్రజా సమస్యలను పక్కన పెట్టి విన్యాసాలకు పరిమితమైన యంత్రాంగం ఇకనైనా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని, ఎన్ని ముఖ్య కార్యక్రమాలొచ్చినా ప్రజా సమస్యల పరిష్కారాన్ని ఒక ముఖ్యాంశంగా చూడాలని జనం కోరుతున్నారు.

-వియస్‌ఎస్‌వి.ప్రసాద్

పలుచోట్ల ప్రపంచ యోగా దినోత్సవం

పెనుమంట్ర : మండలంలోని పెనుమంట్ర-గరువు ఆంధ్రా అసోసియేషన్(యుకె) జూనియర్ కళాశాల ప్రాంగణంలో విద్యార్థులతో యోగాంధ్ర, ప్రపంచ యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నేచురోపతి యోగా డాక్టర్ టి.పూర్ణ, యోగాంధ్ర జిల్లా స్పెషల్ ఆఫీసర్ హరిప్రకాష్, ఎంపిడిఒ ఎంఎస్.ప్రభాకరరావు, తహశీల్దార్ వై.రవికుమార్, ఎంఇఒ-2 యు.నాగేశ్వర రావు పాల్గొన్నారు.

మండలంలోని పలు గ్రామాల్లో కూటమి నాయకులు పంచాయతీలు, ఉన్నత పాఠశాలలు, మోడల్ పాఠశాలల్లో యోగా కార్యక్రమాలు నిర్వహించారు.

ఉండి: ఏకాగ్రతతో శరీరం, మనసు కేంద్రీకరించి యోగా చేయడం వల్ల అనేక రోగాలను నియంత్రించగలుగుతామని ఇన్‌ఛార్జి మండల అభివృద్ధి అధికారి సిఎస్‌వి.రెడ్డి అన్నారు. శనివారం మండల వ్యాప్తంగా యోగాంధ్ర కార్యక్రమాలను సచివాలయాల వద్ద నిర్వహించారు. సర్పంచులు ఛాంబర్ అధ్యక్షులు దాసరి వెంకటకృష్ణ, సిఎస్‌వి.రెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎం.ప్రవీణ్ కుమార్, మానవత సభ్యులు, సచివాలయ సిబ్బంది, విఆర్‌ఒ ఎస్.దాసు పాల్గొన్నారు.

ఆకివీడు : యోగా సంపూర్ణ ఆరోగ్యానికి మార్గమని పలువురు వక్తలు పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మండల కేంద్రం ఆకివీడులో పలుచోట్ల యోగా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్‌లో విద్యార్థులు యోగా అనంతరం స్వచ్ఛంద ప్రమాణం నగర పంచాయతీ కమిషనర్ కె.కృష్ణమోహన్ చేయించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వీరవాసరం : మండలంలోని వివిధ పాఠశాలల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శనివారం కోలాహలంగా నిర్వహించారు. వీరవాసరం ఎంఆర్‌కె జెడ్‌పి హై స్కూల్, రాయకుదురు, తోలేరు జిల్లా పరిషత్ హై స్కూల్స్‌లో, వీరవాసరం లిటిల్ బర్డ్స్ హై స్కూల్‌లో యోగా దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జుత్తిగ శ్రీనివాస్, విఎం జెడ్ శ్యాంప్రసాద్, కానుకొలను శ్రీనివాసరావు, లిటిల్ బర్డ్స్ హై స్కూల్ సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ కూరెళ్ల నరసింహ రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆచంట : దీర్ఘకాలిక వ్యాధుల నివారణకు, శరీర ధృఢత్వానికి, మానసికోల్లాసానికి యోగా ఉత్తమ పరిష్కారమని ఎంపిడిఒ బిఎస్ఎస్.కృష్ణమోహన్ అన్నారు. శనివారం మండలంలో 15వ సచివాలయం వద్ద ప్రత్యేక యోగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. స్పెషల్ ఆఫీసర్ పిచ్చయ్య, తహశీల్దార్ జి.కనకరాజు, డిప్యూటీ తహశీల్దార్ ఎం.సోమేశ్వరరావు, ఇఒపిఆర్‌డి జి.నరసింహారావు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : యోగా వల్ల జ్ఞాపకశక్తి పెరుగుతుందని, మానసిక ప్రశాంతత చేకూరుతుందని కొమ్ముగూడెం గ్రామ సర్పంచి తాడేపల్లి బేబి పేర్కొన్నారు. ఈ సందర్భంగా కొమ్ముగూడెం అంగన్‌వాడీ కేంద్రం, గ్రామ సచివాలయం వద్ద యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం గ్రామంలో యోగా ర్యాలీ నిర్వహించి సర్పంచి బేబి మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తాడేపల్లి శ్రీను, అంగన్‌వాడీ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది, విద్యార్థుల పాల్గొన్నారు.

తణుకు : విశాఖలో నిర్వహించిన యోగాంధ్ర-2025 కార్యక్రమంలో శనివారం తణుకు ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ పాల్గొన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హాజరైన ఈ కార్యక్రమంలో రాధాకృష్ణ పాల్గొన్నారు. యోగాంధ్ర 2025 కార్యక్రమం గిన్నిస్ బుక్ రికార్డు సృష్టించడం అభినందనీయమన్నారు. యోగాలో సూరత్ రికార్డు అధిగమించడం గర్వకారణమన్నారు. అనంతరం గిన్నిస్ బుక్ ప్రతినిధుల చేతుల మీదుగా మంత్రులు, ఎంఎల్‌ఎలు, అధికారులకు జ్ఞాపికలు అందజేశారు.

మొగల్తూరు : మండలంలోని గ్రామాలలో ప్రపంచ యోగా దినోత్సవం వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, దేవాలయాలు, ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, ముఖ్య కూడళ్లలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి యోగా సాధన చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కె.రాజకిషోర్, సర్పంచి పడవల మేరీ సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయులు వర్ధమాన రవిశంకర్, మాజీ జెడ్‌పిటిసి సభ్యులు గొబ్బల నాగరాజు, వైస్ ఎంపిపి కాయల సుబ్బారావు పంచాయతీ పాలకవర్గ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తణుకు : యోగా నిరంతరం చేయుట వల్ల మనిషి ఆరోగ్యంగా ఉంటారని, దీని వల్ల మానసిక ఒత్తిడి, రుగ్మతలు తొలుగుతాయని మంత్రిరావు వెంకటరత్నం(బాబు) అన్నారు. స్థానిక పురపాలక సంఘ కార్యాలయ ఆవరణలో యోగాంధ్ర నిర్వహించారు. వావిలాల సరళదేవి మాట్లాడారు. యోగా గురువు శ్రీనివాసరెడ్డిని శాలువా కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. టిడిపి పట్టణ అధ్యక్షులు కలగర వెంకటకృష్ణ, తాతపూడి మారుతీరావు, కొమ్మిరెడ్డి శ్రీనివాస్, షేక్ మూసాసాహెబ్, స్పెషల్ ఆఫీసర్(డిడి పిట్ అండ్ ఎడ్యుకేషన్) జిసిహెచ్.ప్రభాకరరావు, మేనేజర్ వి.చంద్రశేఖర రావు పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : లంకలకోడేరు పిహెచ్‌సి వద్ద నోడల్ ఆఫీసర్ మండల విద్యాశాఖ అధికారి కెఎస్ఎస్.గంగాధర్ శర్మ ఆధ్వర్యంలో డాక్టర్ అద్దాల ప్రతాప్ కుమార్, డాక్టర్ ఎం.సత్య జీవన్ ఆధ్వర్యంలో యోగా ట్రైనింగ్ ప్రోగ్రాం శనివారం నిర్వహించారు. టిడిపి నాయకులు పెన్మెత్స సత్యనారాయణ రాజు, ఆరోగ్య విస్తరణ అధికారి గుడాల హరిబాబు, గ్రామ సర్పంచ్ చొప్పల రజిని, గ్రామ పెద్దలు నెక్కంటి ఆదినారాయణ, పంచాయతీ కార్యదర్శి కనూరి రాజేష్ కుమార్ పాల్గొన్నారు.

పాలకొల్లు : పాలకొల్లు పట్టణంలో పతంజలి యోగా సాధన సత్సంగం, క్షత్రియ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా గురువు బోడపాటి చక్రవర్తిని సత్కరించారు. డాక్టర్ కెఎస్‌పిఎస్.వర్మ, ఉన్నమట్ల కబర్ధి, కెవిఎస్ఎల్ఎన్.రాజు పాల్గొన్నారు.

నరసాపురం: ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం తీర ప్రాంతంలో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, సచివాలయాలు, పంచాయతీలు, కళాశాలల్లో యోగాసనాలు వేశారు. వైఎన్ కాలేజీలో జరిగిన కార్యక్రమానికి ప్రభుత్వ విప్, ఎంఎల్ఏ బొమ్మిడి నాయకర్ ముఖ్య అతిథిగా విచ్చేసి యోగాసనాలు వేశారు. ఆర్‌డిఒ దాసిరాజు, డాక్టర్ చినమిల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : అంతర్జాతీయ యోగాలో భాగంగా తాడేపల్లిగూడెం కోర్టు ప్రాంగణంలో 11వ అదనపు జిల్లా జడ్జ్ షేక్ సికిందర్ భాష ఆధ్వర్యంలో యోగాసనాలు నిర్వహించారు. ఈ కార్యక్రమం బార్ అసోసియేషన్ అధ్యక్షులు సిరిగినీడి విజయకృష్ణ నేతృత్వంలో యోగా గురువు, ఆరా ఫౌండేషన్ చైర్మన్ కరిబండి రామకృష్ణ వారి శిష్య బృందం యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సివిల్ జడ్జ్ సూర్య కిరణ్, ఫస్ట్ అడిషన్ సివిల్ జడ్జ్ లలితా దేవి, ఎపిపి శివరామకృష్ణ, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

పెనుగొండ : ఎస్‌వికెపి డాక్టర్ కెఎస్.రాజు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల అటనామస్ ఎన్ఎస్ఎస్ యూనిట్లు ఎన్‌సిసి, క్రీడా విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ యోగా దినోత్సవాన్ని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వైవిఏ.అప్పారావు అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు పలుచోట్ల విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - వీరవాసరం

ఈనెల 22వ తేదీ వీరవాసరం, కొణితివాడ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో భీమవరం నుంచి వీరవాసరం వచ్చే 33కెవి లో మరమ్మతులు నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని వీరవాసరం విద్యుత్ శాఖ ఎఇ అప్పారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు వీరవాసరం మండలంలో వీరవాసరం, రాయకుదురు, తోలేరు, పంజా వేమవరం, నందమూరి గరువు, పెంకిపాలెం, చింతలకోటి గరువు కొణితివాడ, నవుడూరు, అండలూరు, మడుగు పోలవరం, నేలపోగుల, ఇండస్ట్రియల్ ఫీడర్లకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

తణుకు : తణుకు పట్టణ పరిధిలో 132/33 కెవి సబ్ స్టేషన్‌లో లైన్ల మరమ్మత్తులు, నిర్వహణ నిమిత్తం 22వ తేది(ఆదివారం) ఉదయం 8 గంటల నుండి ఉదయం 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని విద్యుత్ డివిజనల్ ఇంజనీర్ కె.నరసింహమూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. తణుకు పట్టణ పరిధిలో రాష్ట్రపతి రోడ్డు, రైల్వే స్టేషన్ రోడ్డు, సజ్జాపురం, ఆర్‌కె మఠం ఏరియా, ఇరగవరం కాలనీ, మున్సిపల్ కార్యాలయం రోడ్డు ఏరియా, హౌసింగ్ బోర్డు కాలనీ, జపాన్ కాలనీ, పల్లాలమ్మ నగర్, శివబాలాజీ నగర్, కొమ్మాయి చెరువుగట్టు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని, వినియోగదారులు అందరూ సహకరించాలని కోరారు.

ఉద్యోగుల బదిలీల పట్ల సంతృప్తి

ప్రజాశక్తి - వీరవాసరం

వివిధ కేటగిరి ఉద్యోగులు కలిగిన వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగుల బదిలీల పట్ల పూర్తి సంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు వై.మోహన్ రావు శనివారం తెలిపారు. సిఎం నారా చంద్రబాబు నాయుడు, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఉద్యోగుల బదిలీల ప్రక్రియపై ఎప్పటికప్పుడు అటు అధికారులను, ఇటు ఉద్యోగులను, ఉద్యోగ సంఘాలను సమన్వయం చేసుకుంటూ తగు సూచనలు జారీ చేస్తూ.. బదిలీలను అత్యంత పారదర్శకంగా జరుగుటకు కృషి చేశారన్నారు. జోన్-2 రాజమహేంద్రవరం రీజనల్ డైరెక్టర్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిని బదిలీలు సీనియారిటీ విషయంలో కానీ, ఆఫీస్ బేరర్స్ రిటన్స్ విషయంలో కానీ అత్యంత పారదర్శకంగా జరిపించిన వారికి పత్రికా ముఖంగా ధన్యవాదాలు తెలియజేశారు.

రొయ్యల చెరువుల వ్యర్థ జలాలతో..

అన్నదాతకు కాలుష్య కష్టాలు

- ఇష్టానుసారంగా రొయ్యల చెరువుల తవ్వకం..
- వ్యర్థ జలాలు పంట కాలువలోకి..
- పంట కాలువలకు నీటి కాలుష్యం..
- అధికారులు చర్యలు తీసుకోవాలని వేడుకోలు


కె.లంక ఛానల్స్‌లో ఉన్న రొయ్యల చెరువుల వ్యర్థాలు

ప్రజాశక్తి - కాళ్ల

అధికారుల నిర్లక్ష్యం, అక్రమార్కుల స్వార్థం వెరసి అన్నదాతలకు శాపంగా మారుతోంది. ఇష్టానుసారంగా రొయ్యల చెరువులు తవ్వడం, అనుమతులు లేకుండా బోర్లు వేయడం, వ్యర్థ జలాలు కాలువల్లోకి వదిలేయడంతో కాలుష్యం పెరిగిపోతుంది. దీంతో మండలంలోని తీరప్రాంత రైతాంగం ఇబ్బందులు పడుతున్నారు. కాళ్ల గ్రామంలో కె.లంక ఛానల్ నుంచి వెళ్లే లంక కాలువను ఆనుకుని సుమారు వెయ్యి ఎకరాలపైనే వరి, ఆక్వా సాగు చేస్తున్నారు. దొడ్డనపూడి బ్రాంచి ఛానల్‌లో 2వేల ఎకరాలు సాగవుతోంది. కాళ్ల గ్రామం వద్ద కె.లంక ఛానల్లో ఒక వ్యక్తి ఇటీవల వంతెనను నిర్మించారు. వంతెనకు వేసిన అడ్డుకట్టలు తొలగించలేదు. దీనికి తోడు ఎగువ చెరుకువాడ, కోలనపల్లి, కోమటిగుంట గ్రామాల్లో ఉన్న రొయ్యల చెరువుల వ్యర్థజలాలు పంట కాలువలో వదిలి వేయడంతో పంట కాలువ నీరు పూర్తిగా కలుషితమైపోవడంతో పాటు దుర్గంధం వెదజల్లుతోందని పలు గ్రామాల ప్రజలు, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ కాలువ ద్వారా కాళ్ల, దొడ్డనపూడి గ్రామాలకు చెందిన ప్రజల తాగునీటి అవసరాలు, వేలాది ఎకరాల పంట పొలాలకు సాగునీరు సరఫరా అవుతోంది. పంట కాలువ నీరు కాలుష్యం బారిన పడటంతో సాగునీటిగా కూడా వినియోగించుకునే పరిస్థితి లేదని, ఈ నీరు పెట్టుకుంటే ఆకుమడిలో వేసిన విత్తనాలు మాడిపోతున్నాయని, నీరు వాడకానికి కూడా పనికి రాకుండా వాసన వస్తుందని గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేపలు, రొయ్యల చెరువుల వ్యర్థాలను కూడా ఇదే పంట కాలువలో వదులుతున్నారు. దీనిపై సంబంధిత అధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల ప్రజలు, రైతులు కోరుతున్నారు.


కె.లంక ఛానల్స్‌లో నిర్మించిన వంతెన

పంట కాలువలోకి కలుషిత నీరు..

కె.మణికంఠ, వరిరైతు, కాళ్ల

రొయ్యల చెరువుల్లోని కలుషిత నీటిని పంట కాలువలోకి యథేచ్ఛగా వదిలేస్తున్నారు. ఆ నీరు వరి పొలాల్లోకి రావడంతో ఆ భూములు చౌడుబారి పోయే పరిస్థితి ఉంది. రైతులకు తీవ్ర నష్టాన్ని కల్గిస్తుంది.

కాలువ ద్వారా స్వచ్ఛమైన నీరు రావడం లేదు..

ఎన్.ఈశ్వరరావు, వరి రైతు, కాళ్ల

ఖరీఫ్ సాగుకు సిద్ధమౌతున్నాం. కాలువలో స్వచ్ఛమైన నీరు రావడం లేదు. రొయ్యల చెరువులోని ఉప్పుతో కూడిన వ్యర్థపు నీరు పంట కాలువలో కలుస్తున్నాయి. విత్తనాలు మొలకెత్తుతాయో లేదో తెలియని పరిస్థితి నెలకొంది. యథావిధిగా ఆక్వా చెరువుల నుంచి వ్యర్థపు నీటిని కాలువలోకి కలిపేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆక్వా చెరువుల నుంచి వ్యర్థపు నీటిని కాలువలో కలవకుండా చర్యలు తీసుకోవాలి.

విద్యా సామగ్రి పంపిణీ

ఉండి : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే నిరుపేదలకు అవసరమైన విద్యాసామాగ్రిని దాతల సహకారంతో పంపిణీ చేయించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు పిఎస్ఎన్.రాజు అభినందనీయులని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు అన్నారు. శనివారం మండలంలోని మహదేవపట్టణంలోని ఉత్తరపాలెం ఎంపిపి పాఠశాలలో చదివే విద్యార్థులకు సుమారు రూ.10 వేల వ్యయంతో కూడిన విద్యా సామాగ్రిని దాత పెన్మెత్స శ్రీనివాసరాజు సహకారంతో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జుత్తిగ నాగరాజు మాట్లాడుతూ పిఎస్ఎన్.రాజు పాందువ్వ పాఠశాలలో పనిచేసేటప్పుడు విద్యార్థులను ప్రోత్సహించేందుకు దాతలను సమీకరించి తన వంతుగా తాను కూడా నగదు పంపిణీ చేసే వారని, అదే విధంగా ఉత్తరపాలెం పాఠశాలలో బాధ్యతలు చేపట్టగానే ఇక్కడ చదివే విద్యార్థులకు కూడా ఇటువంటి సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని అన్నారు. ప్రతీ ఉపాధ్యాయుడు పిఎస్ఎన్.రాజును ఆదర్శంగా తీసుకోవాలని సర్పంచి వనిమా నాగ వెంకట సుబ్బలక్ష్మి శ్రీనివాస్ అన్నారు. ఎంఇఒ-2 బొక్కా వినాయకుడు, విద్యార్థులు ఉన్నారు.

ఆగస్టులో ఐద్వా జిల్లా మహాసభ

భీమవరం : భీమవరంలో ఆగస్టు నెలలో ఐద్వా జిల్లా మహాసభను నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ తెలిపారు. భీమవరంలో ఐద్వా జిల్లా కమిటీ సమావేశం కాటా పద్మజ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పొగాకు పూర్ణ మాట్లాడుతూ మహిళా సంఘం ప్రాథమిక కమిటీలు, పట్టణ, మండల మహాసభలు నిర్వహించాలని పేర్కొన్నారు. అనంతరం ఆగస్టు నెలలో జిల్లా మహాసభ భీమవరంలో జరపాలని జిల్లా కమిటీ తీర్మానించింది. అనంతరం పాలస్తీనాపై దాడులు ఖండించాలని, పసిబిడ్డల ప్రాణాలకు రక్షణ కల్పించాలని నిరసన తెలియజేశారు.

2029 అంతరిక్ష యానానికి జాహ్నవి ఎంపిక

పాలకొల్లు : ఇప్పటి వరకు భారత్‌లో జన్మించి, నివసిస్తున్న మహిళ నేరుగా అంతరిక్షయానానికి ఎంపిక కాలేదు. 2029 మార్చి నెలలో టైటాన్స్ స్పేస్ ఇండస్ట్రీస్ నిర్వహించనున్న మొదటి అంతరిక్ష మిషన్‌కు జాహ్నవి ఎంపికయ్యారు. పాలకొల్లుకు చెందిన జాహ్నవి 10వ తరగతి వరకు ఉల్లంపర్రు మాంటిస్సోరి స్కూల్లో చదివింది. అమెరికాలోని నాసాకు 2022 విద్యార్థుల విభాగంలో ఎంపిక కాగా ఆమె చదివిన విద్యాసంస్థ సెక్రటరీ మద్దాల వాసు, మిత్రుల ప్రోత్సాహంతో నాసా శిక్షణకు వెళ్లారు. తరువాత ఆమె అంతరిక్ష యాత్ర కోర్సు చదవడానికి జగన్ హయాంలో రాష్ట్ర ప్రభుత్వం రూ.50 లక్షలు మంజూరు చేసింది. దాంతో పోలెండ్‌లో ఆమె శిక్షణ తీసుకున్నారు. ఈ శిక్షణ తరువాత ఆమె టైటాన్స్ స్పేస్ ఇండస్ట్రీస్ నిర్వహించే తొలి మిషన్‌కు 2029 మార్చిలో అంతరిక్షంలోకి వెళతారు. ఆమె ఇంకా అంతరిక్షంలో జీరో డిగ్రీ వద్ద ఉండేలా ప్రత్యేక శిక్షణ తీసుకుంటారు. వివిధ ఎయిర్ క్రాఫ్ట్ నడిపేలా పైలెట్ శిక్షణ తీసుకుంటారు. ఆమె ఎంపిక పట్ల పాలకొల్లు, ఉల్లంపర్రులో హర్షం వ్యక్తమవుతోంది.

సీతారత్నం కుటుంబానికి పరామర్శ


మాట్లాడుతున్న విప్ నాయకర్

మొగల్తూరు : ఇటీవల మృతిచెందిన మొగల్తూరు రేషన్ డీలర్ గుండు సీతారత్నం కుటుంబ సభ్యులను శనివారం విప్ బొమ్మిడి నాయకర్ పరామర్శించారు. మృతురాలు కుమారులు టిడిపి పట్టణ కార్యవర్గ సభ్యుడు గుండు శ్రీనివాస్, రామకుమార్‌లను పరామర్శించారు. సంతాపాన్ని తెలిపారు. ఆయన వెంట టిడిపి మండల శాఖ అధ్యక్షుడు గుబ్బల నాగరాజు, దుసనపూడి దొరబాబు, సత్యనారాయణ, ముక్కు పుల్లయ్య, పట్టా రజనీకుమారి, మైలబత్తుల రాంబాబు ఉన్నారు.

అన్నదానానికి రూ.50,116 విరాళం

భీమవరం టౌన్ : మావుళ్లమ్మ అమ్మవారి శాశ్వత నిత్యాన్నదానంకి హైదరాబాద్‌కి చెందిన చెరుకుమిల్లి సత్యవాణి శనివారం రూ.50,116 విరాళంగా అందజేశారు. వీరికి ఆలయ ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లికార్జున శర్మ, ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ శేషవస్త్రం, ప్రసాదాలు అందజేశారు.

కుక్కల దాడి నుంచి ప్రజలను, పశువులను కాపాడండి

ఇటుకలగుంట గ్రామ సిపిఎం శాఖ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం రూరల్

ఇటుకలగుంట గ్రామంలో కుక్కల దాడి నుంచి ప్రజలను, పశువులను కాపాడడానికి అధికారులు తగు చర్యలు తీసుకోవాలని సిపిఎం గ్రామ శాఖ డిమాండ్ చేసింది. సిపిఎం గ్రామ శాఖ సమావేశం మాగంటి చింతారావు అధ్యక్షతన ఇటుకలగుంట గ్రామంలో శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబురావు, మండల కన్వీనర్ పాలుపూరి సత్యనారాయణ, మండల నాయకులు కండెల్లి సోమరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటుకలగుంట గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. గ్రామంలో కుక్కలు విపరీతంగా పెరిగి ఈ కాలంలో తరచూ మనుషులను, పశువులను గాయాలు చేయటం జరుగుతుందని అన్నారు. ఉక్కుసూరి శ్రీనివాసరావు రూ.90 వేల గేదె కుక్కలు కరవడం వల్ల చనిపోయిందన్నారు. దీనివల్ల ఆ యజమానికి తీవ్ర నష్టం వాటిల్లిందని, అలాగే మరికొంతమంది పశువులను కరుస్తున్నాయని, దారినపోయే పాదాచారులను సైతం వదలకుండా గాయాలపాలు చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే అధికారులు స్పందించి నష్టపరిహారం, తగు చర్యలు తీసుకోవాలని, కుక్కల నుంచి ప్రజలకు రక్షణ కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని, అలాగే గ్రామ చుట్టుపక్కల ఉన్న కోళ్ల ఫారాల నుంచి వస్తున్న ఈగలు వల్ల ఆహార పదార్థాల మీద వాలటం వల్ల ప్రజలు రోగాల బారిన పడుతున్నారన్నారు. తక్షణమే సంబంధిత అధికారులు ఈ రెండు సమస్యల మీద తగు చర్యలు తీసుకుని ప్రజల, పశువుల ప్రాణాలను కాపాడాలని శాఖ డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో పాలుపూరి శ్రీనివాసు, మాగంటి వెంకటరమణ, మల్లిపూడి సీతామహాలక్ష్మి, కోలపల్లి లక్ష్మి, పాల పూరి సత్యవతి, పాలపూరి వెంకట నాగమణి పాల్గొన్నారు.

శ్మశాన వాటిక ప్రారంభం

కాళ్ల : ప్రభుత్వ సహకారం లేకున్నా యువత పట్టుదలతో దాతల నుంచి విరాళాలు సేకరించి ఆహ్లాదకర వాతావరణంలో అత్యంత సుందరీకరణంగా శ్మశాన వాటిక అభివృద్ధి చేయటం శుభ పరిణామమని పలువురు వక్తలు మాట్లాడారు. మండల కేంద్రమైన కాళ్ల గ్రామంలో నూతనంగా నిర్మించిన హిందూ శ్మశాన వాటిక శనివారం ప్రారంభోత్సవం చేశారు. గ్రామ యువత ఆధ్వర్యంలో గ్రామస్తులు, దాతల సహకారంతో సుమారు రూ.30 లక్షలతో నిర్మించిన శ్మశానవాటికలో దహన సంస్కారాలకు ప్రత్యేకంగా నిర్మించిన భవనంతో పాటు, వెయిటింగ్ హాల్ అదేవిధంగా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భారీ శివుని విగ్రహం చూపరులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో కోటి పాండురంగారావు, తోట కృష్ణ పుప్పాల బుజ్జి, బడేటి నరసింహమూర్తి, వానపల్లి శ్రీనివాసరావు, పాపోలు శేషు, గంజాల శ్రీనివాసు, ఆరేటి దిలీప్ కుమార్, గనిశెట్టి సత్యనారాయణ, నిమ్మల పండు, జీవి నాగేశ్వరరావు, గ్రామ పెద్దలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

9న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దిగుపాటి జ్యోతి

ప్రజాశక్తి - ఆచంట

ఆశావర్కర్లను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఒప్పంద జిఒలను విడుదల చేయాలని ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దిగుపాటి జ్యోతి అన్నారు. శనివారం ఆశా కార్యకర్తల యూనియన్ సమావేశం నక్క శైలజ అధ్యక్షతన స్థానిక సిఐటియు కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని, జులై 9న జరగనున్న జాతీయ సమ్మెలో ఆశావర్కర్లు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆశావర్కర్లకు గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, రూ.10 లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికులను యజమానులకు బానిసలుగా మార్చే లేబర్ కోడ్లు రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని, ఆశ వర్కర్లకు పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం జిఒ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పి.మోహన్ రావు, బండి రంగారావు, అంగన్వాడీ కార్యకర్తలు ఎన్.రత్నకుమారి, పి.సత్యవతి, కెఎల్.పార్వతి, జి.వరలక్ష్మి, గంగాభవాని, కె.మరియమ్మ, మంగతాయారు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల నూతన కార్యవర్గం ఎన్నిక..

ఆశా వర్కర్ల యూనియన్ మండల అధ్యక్షురాలుగా సిహెచ్.కృపావతి, కార్యదర్శిగా నక్క శైలజ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా జి.అన్నపూర్ణ, ఎన్.దుర్గా భవాని, ఎన్.కనకదుర్గ, కె.హైమా భవాని, వి.అన్నపూర్ణ, ఎస్.మని, జి.భవాని, కె.సువర్ణ, బి.సాయి లక్ష్మి, ఎన్.విమల ఎన్నుకున్నారు.

ప్రజలను మోసగించిన కూటమి ప్రభుత్వం

వైసిపి జిల్లా నేత ముదునూరి

భీమవరం టౌన్ : చంద్రబాబు నాయుడు ఎప్పుడు అధికారంలోకి వచ్చిన ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను మర్చిపోవడం ఆయన నైజం అని వైసిపి జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాద్ రాజు విమర్శించారు. స్థానిక కెఎస్ రాజు ఫంక్షన్ హాల్‌లో శనివారం వైసిపి విస్తృతస్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వైసిపి అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి మాత్రం ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీలను దైవ గ్రంథాలుగా భావిస్తారని, వాటిని అనుసరిస్తారని ప్రసాదరాజు అన్నారు. ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకువచ్చి జగన్మోహన్ రెడ్డి రికార్డ్ సృష్టించారన్నారు. ఈ సందర్భంగా వెంకట్రాయుడును పార్టీ నాయకులు, కార్యకర్తలు మిత్రులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పూలమాలలతో శాలువాలతో సత్కరించారు. పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకులు ముదునూరి మురళీకృష్ణరాజు, ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్, గతకాలపు నర్సాపురం వైసిపి అభ్యర్థి గూడూరు ఉమాబాల పాల్గొన్నారు.

పలుచోట్ల 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'

ప్రజాశక్తి - భీమవరం


పరిశుభ్రతతోనే పరిపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. ప్రతినెల 3వ శనివారం నిర్వహించే స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్రలో భాగంగా నిర్వహించే కార్యక్రమాన్ని జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ నాగరాణి, రాజ్యసభ సభ్యులు పాకా సత్యనారాయణ చేతుల మీదుగా 9,632 మొక్కలను విద్యార్థులకు, ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్‌ఒ మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా అటవీ శాఖ అధికారి డి.ఆశా కిరణ్, పరిపాలన అధికారి ఎం.భారతి, సీనియర్ అసిస్టెంట్ సిహెచ్.విజయకుమార్, బి.పోశమ్మ, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఎస్.సురేష్ కుమార్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కె.రామ్ ప్రసాద్ పాల్గొన్నారు.

జిల్లాలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జి.గీతాబాయి అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది అందరితో పరిసరాలు శుభ్రం చేయించి మొక్కలు నాటించి గీతాబాయి మాట్లాడారు. కార్యక్రమంలో డిపిఎంఒ సిహెచ్.ధనలక్ష్మి, భావన, సంతోష్ రెడ్డి, డిపిహెచ్ఎన్ఒ వెంకట రత్నం, ఎస్ఒఎంఎస్ ప్రసాద్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మొగల్తూరు : పరిసరాలు శుభ్రంగా ఉంటే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని విప్ బొమ్మిడి నాయకర్ అన్నారు. మొగల్తూరులో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ప్రజలందరూ చెత్త సేకరణ వాహనాలకు ఇళ్లల్లోని చెత్తను అందించి స్వచ్ఛ మొగల్తూరు సహకారానికి తోడ్పడాలని ఆయన సూచించారు. అనంతరం గ్రామంలో ప్రదర్శన చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఉప సర్పంచి బోణం నరసింహారావు, మాజీ జెడ్‌పిటిసి సభ్యులు నాగరాజు, పంచాయతీ, సచివాలయ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు, కుటమి నాయకులు పాల్గొన్నారు.

పెనుమంట్ర : ప్రతినెల మూడవ శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలం నెలమూరు గ్రామంలో జనసేన మండల అధ్యక్షులు కోయ వెంకట కార్తీక్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన పెంచే విధంగా ఎంపియుపి పాఠశాల విద్యార్థులు, గ్రామ ప్రజలు, ఉపాధ్యాయులు కలిసి ర్యాలీ నిర్వహించారు. గ్రామస్తుల నుంచి స్వచ్ఛతను జీవనశైలిగా మార్చడం లక్ష్యంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ప్రతి పౌరుడు అంకితం అవ్వాలని అన్నారు. ప్రభుత్వపరంగా అధిక ప్రాధాన్యతనిస్తూ విశేషమైన కృషిచేస్తున్న ప్రజల సహకారంతోనే స్వచ్ఛ కార్యక్రమం దిగ్విజయం అవుతుందని వక్తలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సెక్రటరీ, సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

గణపవరం : గ్రామంలో మంచినీటిని సక్రమంగా వినియోగించుకోవాల్సిన అవసరం ప్రతిఒక్కరికి ఉందని గణపవరం సర్పంచి మూల అలంకారం అన్నారు. శనివారం స్వర్ణాంధ్రా-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా నీరు-మీరు అనే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గ్రామంలో మంచినీటి సమస్య రాకుండా కృషిచేస్తున్నట్లు చెప్పారు. మంచినీటి పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని అన్నారు. అనంతరం పంచాయతీ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మండల డిప్యూటీ ఎంపిడిఒ పల్లి సత్యనారాయణ, కూటమి నాయకులు, పంచాయతీ కార్యదర్శి డిఎస్ఆర్.ప్రసాద్, సచివాలయ పంచాయతీల సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


ఉద్యోగులను సన్మానిస్తున్న సిబ్బంది

బదిలీ అధికారులకు సన్మానం

నరసాపురం: ఉద్యోగంలో పని చేసేటప్పుడు బదిలీలు సార్వసాధారణమని, అంకిత భావంతో పనిచేసి రైతుల మన్నలు పొందినప్పుడే చేసిన ఉద్యోగానికి ఓ అర్థం ఉంటుందని ఎడిఎ డాక్టర్ సుధాకర్ అన్నారు. శనివారం పట్టణంలోని పశువైద్యశాలలో బదిలీలపై వెళ్లిన, వచ్చిన అధికారులను సిబ్బంది సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ ప్రభుత్వం పాడి రైతులకు అందించే సంక్షేమ పథకాలు, వ్యాక్సిన్లు, మెడికల్ క్యాంపులు నిర్వహించడం వల్ల రైతులకు మరింత చేరువవుతామన్నారు. అదే రీతిలో వచ్చిన ఉద్యోగస్థులు కూడా పనిచేసి వారి మన్నలను పొందాలన్నారు. బదిలీపై వెళ్తున్న డాక్టర్ సుధాకర్, డాక్టర్ నీలిమ, లైఫ్ స్టాక్ ఆఫీసర్ జి.శ్రీనివాస్ ఘనంగా సత్కరించారు. అనంతరం నరసాపురం పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులుగా డాక్టర్ సురేంద్ర కుమార్ అదనపు బాధ్యతలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది వి.పుష్ప ఏంజెల్, వి.కాంచన, కె.అంజిరెడ్డి, నారా సాయిబాబు, సిహెచ్.చందుకుమార్ పాల్గొన్నారు.